ప్రజాశక్తి
సోమవారం 5 జూన్ 2023
5



అల్లూరి సీతారామరాజు

24కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -జి.మాడుగుల:మత్స్యపురం జంక్షన్ వద్ద పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు.జి.మాడుగుల నుండి పాడేరు వెళ్తున్న ఇన్నోవా కారుని తనిఖీ చేయగా 24 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్సై శ్రీనివాస్ అందించిన వివరాలు.. గంజాయితో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకు న్నామన్నారు. వీరి వద్ద నుండి 28000 రూపాయల నగదు, ఇన్నోవా కారు, మూడు మొబైల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిం చామన్నారు.



నిందితులతో పోలీసులు

ఏజెన్సీలో విస్తారంగా కాఫీ సాగు

- పంపిణీకి 2. 25 కోట్ల కాఫీ మొక్కలు సిద్ధం
- 16 వేల ఎకరాల్లో కొత్త ప్లాంటేషన్
- 12 వేల ఎకరాల్లో పాత కాఫీ తోటల పునరుద్ధరణ



ప్రజాశక్తి -పాడేరు: ప్రతి ఏటా వేలాది ఎకరాల్లో విస్తరిస్తున్న కాఫీ తోటలు మన్యానికి మణి భారంగా నిలుస్తున్నాయి. గిరిజనులకు ఆదాయ వనరుగా ఉపాధి కల్పనకు కాఫీ ఎంతో దోహదపడుతోంది. ఏజెన్సీలో ఈ ఏడాది కాఫీ కార్యాచరణ ప్రణాళికను అమలు చేసేందుకు ఐటిడిఏ, కాఫీ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఏజెన్సీ 11 మండలాల్లో గిరిజన రైతుల ద్వారా కొత్తగా 16 వేల ఎకరాల్లో కాఫీ తోటల పెంపకానికి 12 వేల 999 ఎకరాల్లో పాత కాఫీ తోటల పునరుద్ధరణ, 15 వేల ఎకరాల్లో కాఫీ తోటల నిర్వహణ పనులు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేసేందుకు చర్యలు చేపట్టారు.

ఇందుకుగాను కాఫీ రైతులకు పంపిణీ చేసేందుకు రెండు కోట్ల 24 లక్షల 45 వేల 750 కాఫీ మొక్కలను నర్సరీలలో సిద్ధం చేశారు. గత ఐదేళ్లుగా ఏజెన్సీలో అమలు చేస్తున్న కాఫీ కార్యాచరణ ప్రణాళిక ఈ ఏడాది 16 వేల ఎకరాల్లో కొత్తగా కాఫీ ప్లాంటేషన్ చేసేసరికి ఒక లక్ష ఎకరాల్లో కాఫీ తోటల పెంపకం పూర్తవుతుంది. దీంతో, గత 20 ఏళ్లుగా ఐటీడీఏ ద్వారా గిరిజన రైతులు చేపట్టిన కాఫీ తోటల పెంపకం ఈ ఏడాదితో రెండు లక్షల 40 వేల ఎకరాలకు కాఫీసాగు విస్తరించింది.

ఈ ఏడాది కొత్తగా కాఫీ తోటల పెంపకం ప్రారంభించే రైతులకు ఎకరానికి వెయ్యి చొప్పున కాఫీ మొక్కలను, 100 మిరియాల మొక్కలను పంపిణీ చేసేందుకు ఐటిడిఏ, కాఫీ అధికారులు చర్యలు చేపట్టారు. పాత కాఫీ తోటల పునరుద్ధరణ కోసం ఎకరానికి 225 చొప్పున, పాత తోటల నిర్వహణ కింద గ్యాప్ ఫిల్లింగ్ కోసం ఎకరానికి 200 చొప్పున కాఫీ మొక్కలు రైతులకు పంపిణీ చేపడుతున్నారు.

మండలాల వారిగా అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగూడ, పెదబయలు హుకుంపేట ముంచంగిపుట్టు మండలాల్లో 1000 ఎకరాల చొప్పున, కొయ్యూరు, పాడేరు మండలాల్లో 1500 ఎకరాల చొప్పున జీకే వీధి, జీ.మాడుగుల మండలాల్లో 2 వేల ఎకరాల చొప్పున చింతపల్లిలో 3 వేల ఎకరాల్లో ఈ ఏడాది కొత్తగా గిరిజన రైతులు కాఫీ సాగు చేపట్టబోతున్నారు.

కాఫీ పూత ఆశాజనకం..

పాడేరు ఏజెన్సీలో ఈ ఏడాది కాఫీ పూత ఆశాజనకంగా ఉంది. ఏజెన్సీ 11 మండలాల్లోనూ ఇదే రకంగా కాఫీ పూత, పిందె దశ, మొదలు కావడంతో గిరిజన రైతులు దిగుబడి పెరిగే అవకాశాలపై అంచనా వేస్తున్నారు. ఏజెన్సీ వ్యాప్తంగా 11 మండలాల్లో ఈ ఏడాది మార్చి నుంచి వర్షాలు మొదలయ్యాయి. ఈ మేరకు గత మూడు నెలల్లో కూడా వర్షాలు బాగా కురిసి కాఫీ పంటకు కలిసి వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. పీ పూత, పిందె దశను బట్టి గత ఏడాది కంటే ఈ ఏడాది దిగుబడి పెరిగే అవకాశం ఉందని రైతులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది ఎకరానికి సుమారు 500 కిలోల వరకు కాఫీ పళ్ళు దిగుబడి వస్తే ఈ ఏడాది ఎకరానికి 800 కిలోల వరకు కాఫీ పళ్ళు దిగుబడి రావచ్చునని రైతులు చెబుతున్నారు. ఐటీడీఏ కాఫీ అధికారులు కూడా నిత్యం కాఫీ రైతులతో సమన్వయమై కాఫీ తోటల్లో పంట రక్షణకు దిగుబడి పెంచేందుకు చేయవలసిన పనులపై రైతులకు అవసరమైన తోడ్పాటు శిక్షణను అందిస్తున్నారు.



కాఫీ తోటలను పరిశీలిస్తున్న గిరిజనులు



సీలేరు కురుస్తున్న వర్షం

ఈదురుగాలులతో భారీ వర్షం

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరులో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సూర్యుడు తన ప్రతాపాన్ని చూపించడంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ వేడిమికి తాళలేక ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవడంతో వారపు సంతకు కూడా గిరిజనులు అంతంతమాత్రంగానే వచ్చారు. సాయంత్రం ఐదు గంటల వరకు తీవ్రతరంగా ఉన్న ఎండ ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. 6.25 గంటలకు ఆకాశం మేఘావృతమై మబ్బులతో కూడిన వాతావరణం నెలకొని భారీ ఈదురు గాలులు వీశాయి. అనంతరం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో సీలేరు పరిసర ప్రాంతాల్లో చల్లటి వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి ఉష్ణోగ్రతో అల్లాడిన ప్రజలు సాయంత్రం భారీ వర్షం కురవడంతో ఉపశమనం పొందారు.

హుకుంపేట : మండల కేంద్రంలోని ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఈదురు గాలులతో వర్షం కురిసింది. మండలం కేంద్రంలోని బరోడా బ్యాంక్ పక్కన కనకరాజు కిరణ్ షాప్ వద్ద విద్యుత్ వైర్లు తెగి పోయాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్ములు పడిపోయాయి. దీతో రాకపోకలు నిలిచి పోయాయి.

గిరిజన ఉత్పత్తులకు లాభసాటి ధర

-యంత్ర పరికరాల పంపిణీ- ఆధునిక పద్ధతులపై శిక్షణ
ప్రజాశక్తితో స్పైసెస్ బోర్డ్ ఆఫ్ ఇండియా సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ కళ్యాణి



ప్రజాశక్తి -పాడేరు: **పాడేరు ఏజెన్సీలో గిరిజన రైతులు పండిస్తున్న వ్యవసాయ ఉత్పత్తులకు లాభసాటి ధర కల్పించడమే లక్ష్యంగా స్పైసెస్ బోర్డ్ ద్వారా తోడ్పాటు నందించేందుకు వివిధ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు స్పైసెస్ బోర్డ్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ సంస్థ) పాడేరు యూనిట్ సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ బొడ్డు కళ్యాణి వెల్లడించారు. ప్రధానంగా ఏజెన్సీలో గిరిజన రైతులు ఎక్కువగా సాగు చేస్తున్న పసుపు, అల్లం, మిరియాలు పంటల లక్ష్యంగా గిరిజన రైతులకు అవసరమైన సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు వార్షిక ప్రణాళిక కింద 2023-24 సంవత్సరంలో చేపడుతున్న కార్యక్రమాలపై తెలిపిన వివరాలు ఆమె మాటల్లోనే....**

ఉత్పత్తుల నాణ్యత పెంపు పై శిక్షణ

ఏజెన్సీలో ఎక్కువ దిగుబడి వస్తున్న పసుపు, అల్లం, మిరియాలు, చింతపండు లాంగ్ పెప్పర్ ఉత్పత్తుల నాణ్యత పెంపు కోసం గిరిజన రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. 50 మంది రైతుల చొప్పున ఏజెన్సీ11 మండలాల్లో వేర్వేరు ప్రాంతాల్లో ఈ ఏడాది 20 శిక్షణా కార్య క్రమాలు నిర్వహించేందుకు ప్రతిపాదించాం. ప్రభుత్వ క్షేత్ర సిబ్బందికి కూడా మాస్టర్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నాం.

రైతులకు స్టడీ టూర్స్ ఇస్తున్నారా?

గిరిజన రైతులకు స్టడీ టూర్స్ ఏర్పాటు చేస్తున్నాం. ఈ ఏడాది 40 మంది పసుపు, అల్లం, రైతులకు రెండు స్టడీ టూర్స్ తమిళనాడు, లేదా మహారాష్ట్రకు ప్రతిపాదన చేసాం. పసుపు అల్లం, మిరియాల మార్కెట్ల తీరుపై అవగాహన, గిరిజన రైతులకు కొనుగోలుదారులతో భేటీ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.



ఆర్గానిక్ ఫార్మింగ్‌కు ఆర్థిక తోడ్పాటు

గిరిజన రైతులు తాము పండించే వ్యవసాయ ఉత్పత్తులకు ఆర్గానిక్ సర్టిఫికేషన్ పొందడం కోసం 50 శాతం సబ్సిడీపై తోడ్పాటు నందిస్తున్నాం. ఆర్గానిక్ సర్టిఫికేషన్ కోసం నాలుగు లక్షల రూపాయల వరకు వ్యయమవుతుంది. దీనికి గిరిజన రైతు గ్రూపులకు 50 శాతం సబ్సిడీ స్పైసెస్ బోర్డు అందిస్తోంది. వర్మీ కంపోస్ట్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవడానికి రైతులకు ఇండివిడ్యువల్‌గా సబ్సిడీపై 10 వేలు అందిస్తున్నాం.

సబ్సిడీపై ఇస్తున్న యంత్ర పరికరాలు

ఏజెన్సీలో అల్లం, పసుపు, మిరియాలు పండించే రైతులకు అవసరమైన యంత్ర పరికరాలను పోస్ట్ హార్వెస్ట్ స్కీమ్స్ కింద సబ్సిడీపై అందిస్తున్నాం. రైతు గ్రూపులకు 90 శాతం రైతుల ఇండివిడ్యువల్ కింద 75 శాతం సబ్సిడీ అందిస్తున్నాం. పంట కోత అనంతరం ఉపయోగించే యంత్రాలు, టర్మరిక్ స్టీమ్ బాయిలర్స్, టర్మరిక్ పాలిషర్స్, క్లీనర్స్, గ్రేడర్స్, వాషింగ్ మిషన్స్ టార్పాలిన్ షీట్స్ తదితర వాటిని సబ్సిడీపై రైతులకు పంపిణీ చేస్తున్నాం. దీంతో, వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత మెరుగుపడి మార్కెట్లో వాటికి మంచి ధర లభిస్తుంది. గత ఏడాది నాణ్యత కల్పించి 30 టన్నుల మిరియాలు, 20 టన్నుల పసుపు మార్కెటింగ్ చేయించి మంచి ధర కల్పించాం.

సుగంధ ద్రవ్యాలకు అనుకూలమా?

దాల్చిన చెక్క, జాజికాయ, జాపత్రి, లవంగాలు వంటి ఇతర సుగంధ ద్రవ్యాల పంటలకు ఏజెన్సీలో అనుకూల వాతావరణం ఉంది. జాజికాయ, జాపత్రి ఒకే చెట్టుకు దిగుబడి వస్తుంది. కిలో 2500 రూపాయల ధర ఉంటుంది. వీటి పెంపకంపై రైతుల ఆసక్తిని బట్టి తోడ్పాటున అందించేందుకు కృషి చేస్తాం. వీటి పెంపకం రైతులకు లాభదాయకంగా ఉంటుంది. ఇక్కడ మిరియాలు కూడా మంచి దిగుబడితో పాటు లాభసాటి ధర లభిస్తోంది. మిరియాల సాగును పెంచేందుకు మరింత ప్రోత్సాహం కల్పిస్తాం.



విజేత జట్టుతో ఎస్ఐ షరీఫ్

మెగా క్రికెట్ టోర్నమెంట్ విజేత జడ్డంగి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని జడ్డంగి గ్రామంలో మే 30 నుండి జూన్ 4వ తేదీ వరకు జరిగిన గిరి సీమ మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో జడ్డంగి జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం ఫైనల్ మ్యాచ్ జడ్డంగి, లాగరాయి జట్ల మధ్య జరిగగా ఈ మ్యాచ్‌లో జడ్డంగి జట్టు విన్నర్‌గా నిలిచింది, గ్రామ సర్పంచ్ కొంగర మురళీకృష్ణ టాస్ వేయగా, టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన లాగరాయి టీమ్ 12 ఓవర్లకు 60 పరుగులు చేసింది. 61 పరుగుల లక్ష్యంగా బరిలో దిగిన జడ్డంగి జట్టు ఇంకా 4 బంతులు వుండగానే విజయం సాధించింది. అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఇందులో పాల్గొన్న జడ్డంగి ఎస్ఐ షరీఫ్ మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు సింగిరెడ్డి రవి, వార్డ్ మెంబర్ మఠం సత్తిబాబు, బారంగి రాజుబాబు, మాజీ వార్డ్ మెంబర్ కమాల బత్తుల రవి, రావుల లాలిబాబు, పులిమెట్ల బాబు, పులిమెట్ల కరుణ, రావుల రాము, ఈక గోపి మాస్టర్, కోటం సత్తిబాబు మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.



ధారాలమ్మ ఆలయం వద్ద క్యూలైన్లలో భక్తులు

ధారాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

- సౌకర్యాల్లేక ఇబ్బందులు

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం, ధారకొండ ఘాట్‌రోడ్డులోని వెలసిన ధారాలమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకోవడానికి పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయం భక్తులతో కిటకిట లాడింది. అనంతపురం, తుని, అన్నవరం, విశాఖపట్నం, నర్సీపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పలు ప్రాంతాల నుండి, తెలంగాణ, ఒడిశా, చత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాల నుండి భక్తులు ప్రత్యేక వాహనాల్లో అమ్మవారి ఆలయానికి తరలివచ్చారు. కొంతమంది భక్తులు మేకలు, కోళ్లతో మొక్కుబడులు తీర్చుకొని అక్కడే వంటలు చేసుకొని భోజనాలు చేశారు. పెద్ద సంఖ్యలో వాహనాల రాకతో ఆలయ సమీప ప్రధాన రహదారి ప్రమాదపు మలుపు నుంచి అమ్మవారి ఆలయం ప్రధాన రహదారి కింది వరకు వాహనాలు రోడ్డు నిలిచిపోవడంతో రవాణా సౌకర్యానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. భక్తు సేదతీరడానికి ఎటువంటి విశ్రాంతి భవనాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురయ్యారు. వంటలు చేసుకోవడానికి వంటశాలలు కూడా లేకపోవడంతో ఆరుబయటే వంటలు చేసుకొని ఎండ వేడిమికి తాళలేక అనేక అవస్థలు పడ్డారు. పూర్తిస్థాయిలో టాయిలెట్లు సౌకర్యం లేక స్త్రీలు ఇబ్బంది పడ్డారు. ధారాలమ్మ అమ్మవారి ఆలయానికి రోజురోజుకీ భక్తులు తాకిడి పెరిగిపోతుంది. అమ్మవారికి ధన, కానుకలు రూపన అధిక ఆదాయం వస్తుంది. అయినప్పటికీ భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో దేవాదయ శాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఇప్పటికైనా భక్తులు ఇబ్బందులను గుర్తించి ధారకొండ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వసతి భవనాలు, వంటశాలలు, టాయిలెట్లు, స్నానాలు ఆచరించడానికి పూర్తిస్థాయిలో నీరు, తాగునీరు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఏజన్సీ నుండి మైదాన ప్రాంతానికి బైక్‌పై అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుండి 10 కేజీల గంజాయి, ఒక మోటార్ సైకిల్, రూ.2500 నగదును రాజవొమ్మంగి డిప్యూటీ తహశీల్దార్ సమక్షంలో సీజ్ చేసినట్లు జడ్డంగి ఎస్ఐ షరీఫ్ తెలిపారు. నిందితులను అడ్డతీగల జెఎఫ్‌సిఎం కోర్టుకు తరలించగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.



పట్టుబడ్డ గంజాయి, నిందితులతో పోలీసులు



స్నానాలు చేస్తున్న పర్యాటకులు

పర్యాటకుల సందడి

ప్రజాశక్తి -పాడేరు:మండే ఎండలతో అల్లాడుతున్న జనం వేసవి ఉపశమనం కోసం మైదాన ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున మన్యానికి కదిలి వస్తున్నారు. చెట్లు చామలు, జలపాతాలతో మన్యంలో కాస్త ఉండే చల్లదనాన్ని ఆస్వాదించడానికి వస్తున్న పర్యాటకులు, సందర్శకులకు ఏజెన్సీలో ఉపశమనం లభిస్తుందని చెప్పాలి. ఈ మేరకు ఆదివారం పాడేరుకు సమీపంలోని జిమాడుగుల మండలం కొత్తపల్లి జలపాతానికి పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివచ్చారు. ఇక్కడున్న జలపాతంలో పిల్లలు, పెద్దలు, మహిళలు సైతం జలకాలాటలో మునిగిపోయారు. ఎండ వేడి దహిస్తున్న మధ్యాహ్నం సమయానికి ఇక్కడ కురిసిన భారీ వర్షం పర్యాటకులను మరింత మురిపించింది. జోరు వానలోనూ జలపాతంలో సందర్శకులు జలకలాడుతూ సందడి చేశారు. ఓవైపు జలకాలాటలతో మరోవైపు కాసేపు కురిసిన వర్షంతో పర్యాటకులు ఎంతో ఆహ్లాదాన్ని పొందారు.



ప్రచారం చేపడుతున్న గిరిజన సంఘం నేతలు

ఆదివాసీ సంస్కృతి సంబరాలను జయప్రదం చేయండి

గిరిజన సంఘం నేతల ప్రచారం

ప్రజాశక్తి-అరకులోయ :ఏపీ గిరిజన సంఘం 8వ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఈనెల 6,7,8, తేదీల్లో నిర్వహించ తలపెట్టిన ఆదివాసి సంస్కృతి సంబరాలను విజయవంతం చేయాలని సుంకరమెట్ట వారపు సంతలో ఆదివారం ఈ సంఘం నేతలు విస్తతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న. అధ్యక్షులు జి. బుజ్జిబాబు, ఉపాధ్యక్షులు కె.బుజ్జిబాబు మాట్లాడుతూ, ఆదివాసీ సాంస్కతిక. పరిరక్షణ, హక్కులకై పోరాటం చేయాలన్నారు. ఆదివాసి సంప్రదాయలు, కళలు కనుమరుగై పోతున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి తరుణంలో భవిష్యత్తు లో ఆదివాసీ యువతకు సాంస్కతి, సంప్రదాయలు, వారసత్వం అందాల్సి వుందన్నారు.వేలాదిమంది గిరిజన మేధావులు, యువత గిరిజన ప్రజానీకం అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల సహాయ కార్యదర్శి పి.నానిబాబు, నాయకులు టి.జోషి తదితరులు పాల్గొన్నారు.

2013 భూ సేకరణ చట్ట ప్రకారం పరిహారం, పునరావాసం కల్పించాలి

పాదయాత్ర సన్నాహక సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి చిన్నబాబు

ప్రజాశక్తి -విఆర్.పురం

పోలవరం నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం పరిహారం, పునరావాసం కల్పించాలని సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని చొక్కనపల్లి, చిన్నమట్టపల్లి గ్రామాల్లో నిర్వహించిన పాదయాత్ర సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు శాపంగా మారిందన్నారు. చట్టం ప్రకారం నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారం, పునరావాసం ఇవ్వకుండా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరి మీద ఒకరు నెట్టుకోవడం దారుణమన్నారు. నిర్వాసితుల సమస్యలపై ఈ నెల 20 నుండి జులై 9 వరకు నెల్లిపాక నుండి విజయవాడ వరకు 18 రోజులు 400 కిలోమీటర్లు, 1000 మందితో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముంపు గ్రామాలను కలుపుతూ సాగే ఈ పాదయాత్రకు నిర్వాసితులు అధిక సంఖ్యలో కదిలి రావాలని పిలుపునిచ్చారు. గోదావరి వరదల నుండి నిర్వాసితులను రక్షించేలా మందస్తు చర్యలు తీసుకోవాలని, గత వరదల్లో నష్టపోయిన వరకు పరిహారం ఇవ్వాలని, తప్పుల తడకగా ఉన్న కాంటూర్ లెక్కలు మార్చాలని, శాస్త్రీయ పద్ధతిని అనుసరించి సర్వేలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల నాయకులు తోడం రాజు, గుండెపూడి లక్ష్మణరావు, పంకు సత్తిబాబు, సున్నం దూలయ్య, కారం కృష్ణమూర్తి, సోడి మల్లయ్య, కారం దారయ్య, ఆత్మకూరు కాంతారావు, సోడి భుబామ్మ, పండ వెంకటేశ్వర్లు, సోడి రాజారావు, మాజీ సర్పంచ్ పులి సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు

టిడిపి ఆధ్వర్యాన 'ఏరువాక'



పూజ చేస్తున్న రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి

ప్రజాశక్తి - రంపచోడవరం

ఈ ఏడాది వర్షాలు బాగా పడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ ఏరువాక పౌర్ణమి సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యాన ఆదివారం మండలంలోని తాటివాడ గ్రామంలో ఏరువాక కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, టిడిపి సీనియర్ నాయకులు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నంబాబు రమేష్ తదితరులు నాగలితో దుక్కి దున్ని ఏరువాకను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఎక్కువగా న్యాయం చేసేది టిడిపియేనని పేర్కొన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి ఏటా రైతన్నలకు రూ.20 వేలు వారి ఖాతల్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పెంటపాటి అనంత మోహన్, కారం సింహాచలం, సిద్ధ వెంకన్న దొర, కుంజం బాపన్న దొర, కొమరం బాబి, బొరగా గంగరాజు, వసంతకుమారి, సిరిసం అబ్బులు, బొరగా సోమరాజు, కారం బాపిరాజు, సిరిసం సూర్యనారాయణ దొర, కారం అబ్బాయి దొర, కోటం వెంకటేశ్వర్లు దొర, బాబ్జి, బుచ్చిరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాడేరు టౌన్ : రైతు భరోసా కేంద్రాల పేరిట వైసిపి ప్రభుత్వం రైతులను దగా చేస్తోందని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆరోపించారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు కుమ్మరిపుట్టు పొలంలో ఆదివారం ఏరువాక కార్యక్రమాన్ని పాడేరు నియోజవర్గ టిడిపి ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, నియోజకవర్గ పరిశీలకులు రాజమండ్రి నారాయణతో కలసి పొలంలో దుక్కి దున్ని ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతు సమస్యలకు శాశ్వత పరిష్కారం టిడిపితోనే సాధ్యమన్నారు. మహానాడులో రైతులకు ఆర్థికపరమైన భరోసాను ఇవ్వడం జరిగిందని తెలిపారు. రైతు భరోసా కింద నాలుగేళ్లలో రైతులకు యంత్ర పరికరాలు ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



దుక్కి దున్నుతున్న పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి



మృతి చెందిన పశువు

కాలువలో పడి పశువు మృతి

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని వేంగడ పంచాయతీ డాలింగ్‌పుట్టు గ్రామానికి చెందిన సొంటెరు. అప్పనకు చెందిన పశువు కాలువలో పడి మృత్యువాతకు గురైంది. మేతకు వెళ్లిన పశువు తాగునీటి పైపులైన్ కోసం తవ్విన కాలువలో ఆదివారం ప్రమాదవశాత్తు జారిపడింది. ఈ ఆ సమయంలో ఎవరు గమనించక పోవడంతో మృతి చెందింది. ఎద్దు మృతి చెందడంతో రైతు లబోదిబోమన్నాడు.ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని ఆయన కోరారు.

అక్రమ బదిలీని నిలిపి వేయాలని..

టూరిజం కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి -అనంతగిరి:హరిత రిసార్ట్‌లో పని చేస్తున్న కార్మికుడు పాంగి లక్ష్మణరావు అక్రమ బదిలీకి వ్యతిరేకంగా కార్మికులు ఆందోళన చేపట్టారు. బదిలీ తక్షణమే నిలుపుదల చేయాలని, లేకుంటే విధులు నుండి బహిష్కరించి ఆందోళనలు ఉధృతం చేస్తామని కార్మికులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కార్మికుల సంఘం నాయకులు డి.బుద్ధరాజు, సన్యాసులు మాట్లాడుతూ, తమతో పాటు విధుల్లో క్రమశిక్షణగా మెలుగుతూ ఎటువంటి మచ్చలేని తమ తోటి కార్మికుడు లక్ష్మణరావుకు ఏ కారణం చూపకుండా ఎందుకు కర్నూల్ డివిజన్‌కు బదిలీ చేసారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇదంతా రాజకీయ కుట్ర అని, కక్షపూరితంగా వైసిపి నాయకులు ఆయనపై తప్పుడు ఆరోపణలు చూపిస్తూ బదిలీ చేయించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. కార్మికుల పట్ల ఇటువంటి రాజకీయ కుట్రలు, కుతంత్రాలు పనికి రావని వారు స్పష్టం చేశారు. గత 16. సంవత్సరాలుగా ఇదే యూనిట్లో ఉంటూ విధులు నిర్వహిస్తున్నామని, ఆయనపై ఎటువంటి అభియోగాలు లేవన్నారు. సిబ్బందితో కలివిడిగా సామరస్యంగా ఉంటారని అన్నారు. బదిలీ నిలుపుదల చేయకపోతే విధులు బహిష్కరించి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అరకు, బొర్రా, టైడ. యూనిట్లలో పని చేస్తున్న కార్మికులతో పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. ఇప్పటికైనా అక్రమ బదిలీని వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంగు, నీలమ్మ, గుండు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జెడ్‌పిటిసి గంగరాజు వినతి

స్థానిక హరితహోటల్ రిసార్ట్‌లో విధులు నిర్వహిస్తున్న పాంగి లక్ష్మణరావును ఎటువంటి కారణాలు లేకుండా వేరే డివిజన్‌కు బదిలీ చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని కోరుతూ టూరిజం శాఖ డివిఎం హరితరెడ్డికి కలిసి లిఖితపూర్వకంగా విన్నవించారు.ఆదివారం మండలంలో పర్యటనకు వచ్చిన డివిఎమ్‌ను స్థానిక హరితహోటల్ రిసార్ట్ వద్ద కలిసిన జెడ్పిటిసి దిసరి.గంగరాజు లిఖిత పూర్వకంగా విన్నవిస్తూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 16 సంవత్సరాలుగా ఈ టూరిజం శాఖని నమ్ముకుని విధులు నిర్వహిస్తున్న లక్ష్మణరావును కర్నూల్ డివిజన్‌కు యాజమాన్యం బదిలీ చేస్తూ తీసుకున్న నిర్ణయం తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. రాజకీయ కక్షపూరితంగానే లక్ష్మణరావును బదిలీ చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు ఈ బదిలీ నిలుపుదల చేయకపోతే ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న టూరిజం శాఖ కార్మికులు ఆయనకు మద్దతుగా ఆందోళనా కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.ఈ కార్యక్రమంలో పాంగి. రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



డివిఎం హరితరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గంగరాజు

ఘనంగా బాలసుబ్రహ్మణ్యం జయంతి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : గాన గంధర్వులు, కీర్తిశేషులు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం జయంతిని ఎస్‌పిబి అభిమాన సంఘం ఆధ్వర్యాన విశాఖలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమాన సంఘం సభ్యులు శర్మ ఉప్పికల్ ప్రతినిధి ఆర్జంకి వాసు, కబడ్డీ శ్రీను, వెంకీ పాగోటి, వనమా శ్రీను, సాయి, శంకర్, మురళి తదితరులు మాట్లాడుతూ, విశాఖ సముద్ర తీరాన ఎస్‌పి.బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని కోరారు.

ప్రజల్ని మభ్యపెడుతున్న జగన్ : గండి బాబ్జీ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అబద్ధాలాడుతూ ప్రజలను మభ్యపెడుతోందని మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ విమర్శించారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, బాలసోర్ రైలు దుర్ఘటన బాధాకరమని తమ పార్టీ తరపున సంతాపం తెలిపారు. కవచ్ వ్యవస్థ పని చేయకపోవడం విచారకరమన్నారు. ప్రస్తుతం ఏపిలో ఏరువాక మొదలవుతున్న సమయంలో కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పని ముట్లు అందకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్‌బికెల్లో పనిముట్లే లేకపోయినా లేనిపోని ఆర్భాటాలకు జగన్ ప్రభుత్వం పూనుకుంటుందన్నారు. ప్రతి రైతూ రూ.2,45,500 సగటు అప్పుల్లో కూరుకు పోయారని, కౌలు రైతుల ఆత్మ హత్యల్లో ఎపి 2వ స్థానంలో ఉందని తెలిపారు. రైతు భరోసా కింద రూ.13,500 ఇస్తామన్నారని, ఇచ్చారా అని ప్రశ్నించారు. నాలుగేళ్లలో 9 తుపానులు వచ్చి 54 లక్షల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని, నష్టపరిహారం చెల్లించడానికి లేనిపోని సాకులు చూపి, రైతులకు జగన్ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. పోలవరం 2022 డిసెంబర్‌కు పూర్తి చేస్తామని చెప్పారని, ఏ మేరకు పని చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరాన్ని ఎటిఎమ్‌లా ఉపయోగించుకుని కేంద్రం నుంచి నిధులు స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. 28 వేల ట్రాక్టర్లు ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎవరికిచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.

20ఎ సిటీ బస్సును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : 20ఎ సిటీ బస్సును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ వార్వా, నివాస్, హెచ్‌బి కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం హెచ్‌బి.కాలనీ లాస్ట్ బస్సు స్టాప్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వార్వా, నివాస్ ప్రతినిధులు మాట్లాడుతూ, కరోనా సమయంలో ఈ బస్సును రద్దు చేశారని తెలిపారు. దీన్ని రద్దు చెయ్యడం వలన జగదాంబ పూర్ణా మార్కెట్, వన్ టౌన్ ప్రాంతాలకు వెళ్లేందుకు సిటీ బస్సు సౌకర్యం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. బస్సు లేకపోవడంతో జగదాంబ తదితర ప్రాంతాలకు వెళ్లేందకు రూ.40 ఖర్చు చేయాల్సి వస్తోందని తెలిపారు. గతంలో ఆర్‌టిసి ఆర్‌ఎంను కలిసి వినతిపత్రం సమర్పించామని, బస్సులు ఖాళీగా నడుస్తున్నాయని వింత వాదనలు చేస్తున్నారని చెప్పారు. కనీసం రద్దీగా ఉండే సమయంలోనైనా 20ఎ బస్సును నడపాలని కోరారు.



వ్రతాన్ని నిర్వహిస్తున్న కౌన్సిల్ మెంబర్, సభ్యులు

ఘనంగా సత్యనారాయణస్వామి వ్రతం

ప్రజాశక్తి-పాడేరు: పట్టణంలోని ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి వ్రతానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పలువురు దంపతులు ఈ వ్రతమాచరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామివారి రాగి ప్రతిమలను ప్రసాదాల్ని భక్తులందరికీ పంపిణీ చేశారు. ఈ వ్రత మహోత్సవానికి ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ సమర్ప నర్సింగ్‌రావు ఆలయ ఆధ్యాత్మిక సేవ బృందం సభ్యులు బొడ్డు ముకుందరావు, ఉప్పల వెంకటరత్నం, వంతల సూరిబాబు, దాసరి నాగు, కొట్టగుల్లి పోతురాజు, ఆలయ పూజారి రామం పంతులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ర్యాంకింగ్ టోర్నమెంట్ టెక్నికల్ అధికారిగా శర్మ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : హైదరాబాద్‌లో ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న జాతీయ ర్యాంకింగ్ టోర్నమెంట్‌కు టెక్నికల్ అధికారిగా బ్లూ బ్యాడ్జ్ అంపైర్ డాక్టర్ డివిఎస్‌వై.శర్మ నామినేట్ అయ్యారు. డాక్టర్ శర్మ విశాఖపట్నంలో ఎల్‌ఐసిలో పని చేస్తున్నారు. ఆయన ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా డివిఎస్‌వై.శర్మను ఎల్‌ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదా ప్రసాద్ దాస్, మేనేజర్ పర్సనల్ భగవాన్ ప్రసాద్, ఎంప్లాయిస్ అసోసియేషన్ సెక్రటరీ జి.వరప్రసాద్, ప్రెసిడెంట్ కామేశ్వరి అభినందించారు.

నేటి నుంచి కౌలు రైతు రక్షణయాత్ర జాతా

మునగపాకలో ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

కౌలు రైతుల చట్టాన్ని సవరించి, భూ యజమానుల ఆమోదంతో నిమిత్తం లేకుండా గ్రామ సభద్వారా కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులు మంజూరుచేయాలన్న పలు డిమాండ్లతో సాగుతున్న ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు రక్షణ జీపు జాతా సోమవారం ఉదయం 8 గంటలకు మునగపాక నుంచి ప్రారంభంకానుంది. ఈ జీపు జాతాను కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు ప్రారంభించనున్నారు. తొలిరోజు మునగపాక, అచ్యుతాపురం, యలమంచిలి, కశింకోట మండలాల్లోని 12 గ్రామాల్లో, మంగళవారం అనకాపల్లి మండలం తుమ్మపాలలో యాత్ర ప్రారంభమై ఇంకుపాలెం, తగరంపూడి, సీతానగరం మీదుగా చోడవరం మండలం పిఎస్ పేటలో ప్రవేశించి చోడవరం, బుచ్చెయ్యపేట మండలాల్లోని కెజెపురం, లక్కవరం తదితర గ్రామాల్లో పూర్తిచేసుకొని తూర్పుగోదావరి జిల్లాలో ప్రవేశించనుంది.

2011 కౌలుదారీ చట్టాన్ని జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం సవరించి, 2019లో తీసుకొచ్చిన పంట సాగుదారుల హక్కు చట్టంతో కౌలు రైతులకు కొత్త సమస్యలు ముందుకొచ్చాయి. అధికారంలోకి వస్తే కౌలు రైతులను సంరక్షిస్తామని, రైతు ఆదాయాలను రెట్టింపు చేస్తామని ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక కౌలురైతుకు ఉన్న కొద్దిపాటి భరోసాను లేకుండా చేశారు. భూ యజమానుల ఆమోదం పొందాలన్న షరతు విధించడంతో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పొందలేని పరిస్థితి ఏర్పడింది. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు భూ యజమానులు ఆమోదం ఇవ్వడంలేదు. గ్రామ సభలు నిర్వహించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరుచేయడంలేదు. రాయితీపై విత్తనాలు, ఎరువులు, యంత్రపరికరాలు వంటివేవీ కౌలురైతుకు లభించడంలేదు. పంట రుణం, పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా వంటివి అందడంలేదు.

పెట్టుబడులకు అప్పుల కోసం ప్రయివేటు వ్యాపారులను కౌలురైతుల ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో 70వేల మందికిపైగా కౌలురైతులున్నప్పటికీ నాలుగువేల మందికి కూడా గుర్తింపుకార్డులు లభించలేదు. చెరకు పంట గిట్టుబాటుకాకపోవడం, ప్రభుత్వం సహకార చక్కెర ఫ్యాక్టరీలను నిర్వీర్యం చేయడంతో లక్ష ఎకరాల్లో సాగైన చెరకు 30వేల ఎకరాలకు పడిపోయింది. చెరకు సాగులో అత్యధికమంది కౌలు రైతులున్నారు. అనకాపల్లి, మునగపాక, కశింకోట, అచ్యుతాపురం, చీడికాడ, మాడుగుల, దేవరాపల్లి, చోడవరం, కె.కోటపాడు, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట, యలమంచిలి, రాంబిల్లి మండలాల్లో ఎక్కువమంది కౌలురైతులున్నారు. సాగుచేసి కష్టనష్టాలను భరిస్తున్న కౌలురైతుకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం, ప్రోత్సాహం లభించక పోవడంతో అప్పులపాలవుతున్నారు. కొంతమంది వ్యవసాయాన్ని వదులుకుంటున్నారు. కౌలు రైతుల సమస్యలపై కౌలు రైతుల సంఘం రాష్ట్ర వ్యాపితంగా కౌలు రైతు రక్షణయాత్ర పేరిట జీపు జాతా చేపట్టింది. అందులో భాగంగా జిల్లాలో సోమ, మంగళవారాల్లో జీపు జాతా పలు గ్రామాలు వెళ్లనుంది. కౌలు రైతుల సమస్యలను తెలుసుకోనుంది. ఈ యాత్ర వివిధ జిల్లాల మీదుగా సాగి 12న విజయవాడ చేరుకొని కౌలు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనుంది.

కౌలు రైతుకు నష్టంకల్గించే చట్టాన్ని రద్దు చేయాలి

వైసిపి ప్రభుత్వంలో కౌలు రైతులకు భరోసా లేదు. కనీస రక్షణలేదు. పాడి ఆధారంగా బతుకుతున్న కౌలు రైతు పశుగ్రాసం కోసం వ్యవసాయం చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. కేరళ తరహాలో పంటలకు మద్దతు ధరలు, రుణ విముక్తి చట్టం చేయాలి. పంటరుణాలు, బీమా నష్ట పరిహారం ఇవ్వాలి. భూ యజమాని ఆమోదంతో నిమిత్తంలేకుండా 2011 చట్టాన్ని పునరుద్ధరించి కౌలురైతుకు నష్టంలేకుండా అమలుచేయాలి. రైతు భరోసా వర్తింపజేయాలి. కౌలు రైతుల పేరుతో ఈ క్రాప్ నమోదుచేయాలి.

ఎ.బాలకృష్ణ,
ఎపి కౌలురైతుల సంఘం కార్యదర్శి,అనకాపల్లి జిల్లా

హోండా షైన్ 100 సిసి బైక్ ఆవిష్కరణ



బైక్ ఆవిష్కరిస్తున్న వాసురెడ్డి వంశీ, తదితరులు

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడ సమీపంలోని సీత ప్రైమ్ హోండా షోరూమ్‌లో హోండా షైన్ 100 సిసి కొత్తబైక్‌ను సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వాసురెడ్డి వంశీ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా విశాఖ జిల్లాలో హోండాషైన్ 100సిసి బైక్‌ను మధురవాడ సీత ప్రైమ్ బ్రాంచ్‌లో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. అందుబాటు ధరలో, అతి ఎక్కువ మైలేజీని ఇచ్చే ఈ బైక్, సామాన్య మధ్య తరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సీత ప్రైమ్ హోండా షోరూం ద్వారా ఎప్పటికప్పుడు నూతన బైక్‌లను అందుబాటులోకి తెస్తూ మధురవాడ ప్రాంత ప్రజల ఆదరాభిమానాలను చూరగొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ మోహన్, సర్వీస్ మేనేజర్ అభిషేక్, సేల్స్ మేనేజర్ పి సంజీవ్‌కుమార్, బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యానికి క్రీడల దోహదం



బాక్సింగ్ శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

ప్రజాశక్తి -గాజువాక : చిన్నారుల ఆరోగ్యానికి క్రీడలు దోహదపడతాయని సింహాచలం ట్రస్ట్‌బోర్డు సభ్యులు దొడ్డి రమణ అన్నారు. ఆదివారం 76వ వార్డు బర్మాకాలనీలో అంజనీపుత్ర బాక్సింగ్ క్లబ్, అండి బోయిన సన్నీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడాశిక్షణ శిబిరంలో మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పాఠశాల, కాలేజీ విద్యార్థులకు ఆసక్తి ఉన్న క్రీడాంశంలో నిపుణులతో శిక్షణనివ్వడంతోపాటు, వారికి జివిఎంసి ద్వారా పౌష్టికాహారాన్ని కూడా అందజేస్తున్నామన్నారు. క్రీడల్లో నైపుణ్యత ఆధారంగా విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్, ప్రాధాన్యత ఉంటుందని, ఇలాంటి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దుంగ దేవన్ రాజు, కడవల ఈశ్వరరావు, బోయాడపు శ్రీను, జగరపు శ్రీను, సోమశేఖర్, కోచ్‌లు కె. గణేష్, డి.దీపక్, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

ఒడిశా రైలు ప్రమాదం బాధాకరం

ప్రజాశక్తి- మాధవధార : భారతీయ రైల్వే చరిత్రలో అత్యంత విషాదకరమైన ఘోర రైలు ప్రమాదం ఒడిశా బాలాసోర్ జిల్లాలో జరగడం అత్యంత బాధాకరమని ఎపి రాష్ట్ర కాంగ్రెస్ ఒబిసి విభాగం చైర్మన్ మూల వెంకటరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకేచోట మూడు రైళ్లు ఢీకొన్న ఘటనలో దాదాపు 300మంది మృతి చెందడం, వెయ్యి మందికిపైగా ప్రయాణికులకు గాయాలు కావడం దురదృష్టకరమన్నారు. ఈ ఘటనకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించి, మృతుల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి రైల్వే ఉద్యోగం, క్షతగాత్రులు కోలుకునే వరకు మెరుగైన వైద్యం అందించి, రూ.10లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

క్లోమ సంబంధిత వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి -గాజువాక : మానవ శరీరంలో క్లోమ గ్రంథి అత్యంత ముఖ్యమైనదని, దానికి వచ్చే వివిధ రకాల వ్యాధులపై అవగాహన ఎంతో అవసరమని షీలనగర్ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ ఆచంట చలపతిరావు తెలిపారు. ఆదివారం కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌లో క్లోమ (ప్యాంక్రియాస్) వ్యాధులపై దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సంబంధిత వైద్యనిపుణులతో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి సీఎండీ డాక్టర్ పి.సతీష్ కుమార్ ప్రారంభించిన సదస్సులో డాక్టర్ చలపతిరావు మాట్లాడుతూ, కడుపులో ఏ సమస్య వచ్చినా దాన్ని గ్యాస్ట్రిటిస్ లేదా అజీర్ణం అని తప్పుగా అర్థం చేసుకునే పరిస్థితి ప్రస్తుతం సమాజంలో వేళ్లూనుకుందని, దీని వల్ల రోగ నిర్ధారణలో జాప్యమై, రోగి ఇబ్బందులు పడే పరిస్థితి ఉత్పన్నమౌతుందన్నారు. మద్యపానం, ధూమపానం ఎక్కువ కావడం, పిత్తాశయంలో రాళ్లు చేరిపోవడం వల్ల ప్యాంక్రియాటైటిస్, ప్యాంక్రియాటిక్ కేన్సర్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు.

కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి సీఎండీ డాక్టర్ పి.సతీష్‌కుమార్ మాట్లాడుతూ వివిధ విభాగాల్లో స్థానిక వైద్యులకు అవగాహనకు ఏటా విశాఖలో ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. రోగ చికిత్సలే కాకుండా విద్య, పరిశోధనపరంగా కిమ్స్‌ఐకాన్ ఆసుపత్రిని అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలో అధునాతన గ్యాస్ట్రోఎంటరాలజీ, ఎండోస్కోపిక్ సేవల అవసరాన్ని గుర్తించి, ఇప్పుడు ఎంవీపీ కాలనీలో గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగానికి ప్రత్యేక ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేశామన్నారు. ఆ కేంద్రంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో జీర్ణాశయం, కాలేయ సంబంధిత వ్యాధులపై ఎండోస్కోపిక్, సాధారణ శస్త్రచికిత్సలను తమ ఆసుపత్రి వైద్యనిపుణులు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అందిస్తారన్నారు.



సదస్సు ప్రారంభిస్తున్న డాక్టర్ సతీష్ కుమార్

వైసిపి పాలనలో అందరికీ న్యాయం : సుబ్బారెడ్డి

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని చందక పంచాయతీ జగన్నాథపురం గ్రామంలో గ్రేహౌండ్స్‌కు భూమినిచ్చిన నిర్వాసిత రైతులకు ఆదివారం పరిహారం చెక్కులను. తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవి సుబ్బారెడ్డి ఆదివారం చెక్కులు అందజేశారు. 127 ఎకరాలకు సంబంధించి, 133 మంది రైతులకు రూ.15.38 కోట్ల చెక్కులను అందజేసారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న గ్రేహౌండ్స్ బెటాలియన్ స్థలానికి సంబంధించి నష్టపరిహారం చెల్లింపు సమస్యను సిఎం జగన్ దృష్టికి స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తీసుకెళ్లగా, ఆయన స్పందించి పరిహారం నిధులు విడుదల చేశారన్నారు.ఇంకా నిర్వాసితులెవరైనా తప్పిపోయి ఉంటే వారికి పరిహారం ఇస్తామని హామీనిచ్చారు. వైసిపి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని భరోసానిచ్చారు.నిర్వాసిత రైతులకు పరిహారం కోసంపట్టుదలతో కృషి చేసి న్యాయం చేసిన ఆర్‌డిఒ, తహశీల్దార్, ఇతర అధికారులను ఎమ్మెల్యే ముత్తంశెట్టి అభినందిచారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, భీమిలి ఆర్‌డిఒ భాస్కరరెడ్డి, జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, ఎంపిపి శారద ప్రియాంక, వైస్ ఎంపిపిలు పాండ్రంకి శ్రీను, తహశీల్దార్ లోకవరపు రామారావు, ఎంపిడిఒ అడపా లవరాజు, వైసిపి మండల ప్రెసిడెంట్ బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరావు, ఎఎంసి వైస్ చైర్మన్ బోని అప్పల నాయుడు, భీమిలి యూత్ ప్రెసిడెంట్ ఇల్లాపు వెంకట్‌జగన్, చందక సర్పంచ్ బంక శ్రీను, ఎంపీటీసీ విజనగిరి అప్పలనాయుడు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న సుబ్బారెడ్డి, ముత్తంశెట్టి

యంత్ర సేవా పథకం ట్రాక్టర్లు పంపిణీ

మండలంలో చందక పంచాయతీ జగన్నాథపురంలో వైఎస్ఆర్ యంత్ర సేవా పథకంలో రూ. 1.09 కోట్ల విలువైన 15 ట్రాక్టర్లను రైతులకు అందజేశారు. రూ.36 లక్షల రాయితీతో 15 కస్టమ్ హైరింగ్ సెంటర్ గ్రూపులకు వైవి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జెసి విశ్వనాథన్ అందజేశారు. వ్యవసాయశాఖ జెడి కె.అప్పలస్వామి, ఎడిఎ బి.విజయప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



దాతలను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ముగిసిన మాధవధార చలివేంద్రం

ప్రజాశక్తి- మాధవధార : మాధవధార గ్రామానికి. మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చలివేంద్రాన్ని ఆదివారంతో ముగించారు. మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో. పేడాడ సన్యాసయ్య ,అమ్మాయమ్మ. దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు పేడాడ వెంకటరావు, పేడాడ నర్సింగరావు ఆర్థిక సాయంతో దీన్ని నిర్వహించగా, మాధవధార గ్రామప్రజలు, శ్రేయోభిలాషులు విరాళాలు ఇచ్చి సహకరించారు.

ఈ సందర్భంగా మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నంబాల ఈశ్వరరావు కార్యదర్శి సనపల శ్రీకాంత్ మాట్లాడుతూ. వేసవికాలం ఆరంభంలో ఏటా చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నామన్నారు. చలివేంద్రం నిర్వహణతోపాటు అసోసియేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యాక్రమాలకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సంరద్భంగా. పేడాడ వెంకటరావు, పేడాడ నర్సింగరావులను మాధవధార కళింగ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు.

ముగిసిన సంగీత శిక్షణ శిబిరం

ప్రజాశక్తి- సీతమ్మధార : పద్మవిభూషణ్, సంగీత కళానిధి, భారతరత్న డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ రచించిన తిల్లానాలపై శని,ఆదివారాల్లో పౌరగ్రంథాలయంలో సంగీత శిక్షణా శిబిరం ఘనంగా జరిగింది. విమలకృష్ణ మ్యూజిక్ అకాడమీ అధ్యక్షులు డాక్టర్ మండపాక శారద నిర్వహణలో అహిర్ భైరవి, కుంతల వరాళి, కదనకుతూహలం , బేహాగ్ రాగాలలో తిల్లానాలు నేర్పారు. రెండోరోజు ప్రసిద్ధ మృదంగ విద్వాంసులు వంకాయల వెంకట రమణమూర్తికి బెనారస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసిన సందర్భంగా విమలకృష్ణ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అకాడమీ గౌరవ అధ్యక్షులు ఎం.ఎస్ శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ నాగలక్ష్మి పాల్గొన్నారు



డాక్టర్ వంకాయలను సత్కరిస్తున్న శారద

అలరించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి -పిఎం.పాలెం : మధురవాడ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శ్రీసాయి కళానికేతన్ కూచిపూడి నాట్యమండలి వారిచే శాస్త్రీయ, జానపద నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పాట, దశావతారం, శ్రీ విష్ణు రాజంభజే, కల్యాణ రామ, అమ్మ అమ్మ, లలితా హారతి, శివ తాండవ, నాగేంద్ర హరయ, సీతా కల్యాణం, వరాహ రూపం, స్వాగతం కృష్ణ, కోయిలరే , వదినకు ఒకసారి, గాజుల సవ్వడి తదితర నృత్యరీతులను ప్రదర్శించారు.అనన్య, నైపుణ్య, లాస్య శ్రీ, యోగిత, బిందు, మహాలక్ష్మి, యశ శ్రీ, విజయ, లలితా, అక్షిర, వేదమయి, నిక్షిప్త, దీక్ష, లక్ష్మి అక్షయ, తదితర కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, అభినయం సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలనాధికారి టి. విశ్వనాథ్ రెడ్డి తెలిపారు.



నృత్యం చేస్తున్న చిన్నారి కళాకారులు

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న కుమార్తె

ప్రజాశక్తి - ఆరిలోవ : రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందిన విషాద ఘటన ఆదివారం సాగర్‌నగర్ బైపార్క్, ర్యాడిసన్ పార్కు సమీపంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలివి. విజయనగరం జిల్లా భోగాపురం ప్రాంతానికి చెందిన మైలపల్లి పెద్దయ్య(30) ఆయన భార్య పావని(25), మూడేళ్ల కుమార్తె యక్షిత నగరంలోని జాలారిపేటలో నివాసం ఉంటున్నారు. పెద్దయ్య వృత్తిరీత్యా కూలి. సొంతూరిలో బంధువుల వివాహానికి శనివారం భార్య, కూతురితో వెళ్లిన పెద్దయ్య, తిరిగి ఆదివారం వేకువజామున అదే బైకుపై విశాఖకు వస్తుండగా, జాతీయ రహదారి ఎండాడ నుంచి రుషికొండ వెళ్లి, అక్కడ నుంచి బీచ్ రోడ్డులో జాలారిపేట వస్తుండగా బైపార్కు, ర్యాడిసన్ బ్లూహోటల్ వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో బైకు నడుపుతున్న పెద్దయ్య తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కొన ఊపిరితో ఉన్న భార్య పావని, కుమార్తె యక్షితలను స్థానికులు గీతం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పావని మృతి చెందింది. యక్షితను కెజిహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతోంది. భార్యాభర్తల మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు మృతుడు పెద్దయ్య మామ ఎరుపల్లి సన్యాసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.